# నేలమీది నక్షత్రాలు

ఎలక్ట్రాన్



కొండవాగు బండరాళ్ళమీదుగా పొర్లి, కిందనున్న యిసుకలో సెలయేరుగా మారి గలగలా నవ్వుతోంది. రోజల్లా కాసిన ఎండ ఎర్రగామారి, ఆహ్లాద కరంగా ఉంది. ముడుచుకుపోయిన సుగంధరాజనాలు విప్పారి, సువాసనల్ని వెదజల్లుతున్నాయి. కాని రాజారావు గుండెలో పార్వతి మీది ద్వేషం అలానే ఉండిపోయింది.

బొమ్మలు విరిగితే ఏడవకూడదని పిల్లలకు పాఠాలు చెప్పే రాజారావు, కలలు చెదిరి మౌనంగా ఏడ్చాడు. ఆశాసౌధాల్లో విహరించడం వెర్రితనమని భావించే రాజారావు, పునాదుల్లేని ప్రేమ సౌధం పేకమేడలా కూలినందుకు మనస్సు ముక్కలై మరీఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి గూడుకట్టుకొన్న బాధని ద్వేషంగా మార్చుకొని, వెన్నలాంటి మనసుని రాతిమనసుగా మార్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

పార్వతి తలపుల్లో తనకింతచోటూ, సదభిప్రాయమూ ఉన్నాయని నిర్ధారణ

చేసుకొన్నరోజున, "మనసులో మీమీది మమతలు కలలుగా రూపొందించు కొంటూ, మూడునెలలుగా స్వాప్నిక జగత్తులో ఉంటూ ఉండివచ్చాను. మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్ని మళ్ళీ సుమంగళిగా చేసే అదృష్టం నాకిస్తా రనుకొంటాను," అని స్కూలువరం డాలో రాజారావు, ఆమెని అడిగాడు. పార్వతి చివ్వున కళ్ళెత్తి రాజారావు కళ్ళలోకి చూసింది. నీళ్ళతెరలు కమ్మిన పార్వతి కళ్ళలో తనబొమ్మను చూసు కొంటూ మౌనంగా నిలబడిపోయాడు. పార్వతి తలవంచుకొని నెమ్మదిగా అంది. "నాకు, ఆరేళ్ళ కొడుకున్నా డన్న సంగతి మీరు మరిచిపోయారను కొంటాను!"

"అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మీ అంగీకారంకోసం ఎదురు చూస్తూంటాను."

"అత్యాశకు పోవడమేమోనని ఆలో చిస్తున్నాను. పసివాడిమనసు బాధపడ్తుం దన్న భయంతో, మళ్ళీ వైవాహిక జీవి తంలో అడుగుపెట్టడానికి ధైర్యం చాలటంలేదు. నామీది జాలికొద్దీ మీరీ నిర్ణయానికి రావడం నాకిష్టంలేదు. కాదు, ప్రేమంటారూ, అదృష్టవంతురాల్ని. అయినా ఆలోచించడానికి కొంచెం వ్యవధికావాలి."

ఆ మాటలకే రాజారావు పొంగిపో యాడు. పార్వతి కొడుకుని చేరదీసి సన్నిహితుడైపోయాడు. తన కొడుకు భవిష్యత్తుకు భయంలేదని నిశ్చయించు కొన్న పార్వతి, అదే సెలయేటి ఒడ్డున రాజారావు చేతిలో చేయివేసినరోజున, మీదవడ్తోన్న రుద్రగన్నేరు పువ్వుల్నీ, గలగలా పారుతున్న సెలయేటినీ, కొండల్ని ఆక్రమిస్తున్న పొగమంచునీ- ఇంకా పరిసరాల్నీ, ప్రకృతినీ, అన్నిటినీ మరిచిపోయి, పార్వతిచేతిని ముద్దుపెట్టు కొన్న మధురానుభూతి కలగానే మిగిలి పోయింది రాజారావుకి.

"త్వరపడి ఆ రోజు నిర్ణయానికి వచ్చినందుకు విచారిస్తున్నాను. మన ఈ వివాహం జరగడానికి అవకాశంలేదు బ్రతుకుబాటలో మనం ఒకరికష్టసుఖాలు మరొకరు పంచుకొనేబదులు, బడిపిల్లల భవిష్యత్తుకు మార్గంచూసే సహఉద్యో గులుగా ఉండడమే మేలనుకొంటు న్నాను," అని చిన్న చీటీముక్కలో, పార్వతి రాజారావుని కలతోంచి వాస్త వంలోకి గిరాటువేసింది. కారణాలు అడిగి అలసిపోయిన రాజారావు, కొంత బాధపడి, ఆబాధలోంచి నెమ్మదిగా తేరు కొన్నాడు.

అయితే కారణం తెలిసినరోజున తగిలిన విఘాతానికి తట్టుకోలేక పోయాడు. మెడలో తాళికట్టి తిరిగి సుమంగళిగా చెయ్యడానికి సిద్ధపడ్డ తనని మొదట అంగీకరించి, తర్వాత నిరాకరించిన పార్వతి, ఆ స్కూలు

అధికారవర్గంలోని సోమశేఖరానికి ఉంపుడుగత్తెగా మారినందుకు, రాజారావు హృదయంలో కొండవాగులు పొంగాయి. లోకంలో ఉన్న ఎండంతా గుండెల్లోనే కాసింది.

కసికొద్దీ చేతికందిన రాయి తీసి, నీళ్ళలో విసిరేశాడు. "నామీది కోపమంతా ఆ రాయిమీద చూపిస్తున్నారనుకొంటాను!" వెనకనుంచి వినవచ్చిన మాటలతో రాజారావు తలతిప్పిచూశాడు. పెదాలమీద చిరునవ్వుతో పార్వతి నిలబడిఉంది.

"ఆకాశంలో ఉన్న తారవి. నీళ్ళలోని నీడవి. ఎన్నిరాళ్ళు వేస్తే తగిలినట్లు?" రాజారావు నీళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"పైనున్న చుక్కనికాను, నేలమీది నక్షత్రాన్నే. నీళ్ళలో నీడనికాను. ఒడ్డునున్న మనిషిని. నన్ను రాళ్ళతో కొట్టడం అనవసరం. మీరన్న ప్రతిమాటా నాకు తగుల్తూనేఉంది!" పార్వతి పెదాలమీద అదే చిరునవ్వు వెనుక అణగారిన హిమాలయాల్లాంటి మనోవేదన రాజారావుకి తెలియదు.

"నేలమీది నక్షత్రానివికాదు, నేల రాలిన చుక్కవి! ఒకరాత్రికి ఎంత తీసుకొంటావు?" యిళ్ళని నిలబెట్టి మనుషులను నాశనంచేసే న్యూట్రాన్‌బాంబులా, మనిషిని నిలబెట్టి మనసును దహించే ప్రశ్న అడిగాడు.

"నేలరాలినిచుక్కనయినా, నన్నందుకొనే తాహతు మీకు లేదు. అది బలవంతులకి, ధనవంతులకి చెల్లుతుందికాని, బడిపంతులిక్కాదు!" సమాధానం యిచ్చి, 'పతనమైనదాన్ని. మీరే నాకందని చందమామగా ఉండిపోయారు.' అని మనసులో అనుకొంటూ, పార్వతి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. పార్వతి మనసులో మాటలు రాజారావుకి వినబడలేదు. వినబడ్డ మాటలు రాజారావు ఆలోచనలో చోటుచేసుకొన్నాయి.

కొండలమాటున అస్తమించిన సూర్యుడి వెనుకనే చీకటి పరుగెత్తుకొంటూ వచ్చింది. ఆచీకటిలో రాజారావుకి వెలుగుబాట కనిపించింది. అప్పుడప్పుడూ జీతాలందుకొనే తనలాంటి బడిపంతులు - అందనివాటిని చూస్తూ ఆనందించాలే కాని, పొందటానికి ప్రయత్నించకూడదు! ప్రేమంటే ఏమిటో చదివి తెలుసుకోవాలే కాని, ప్రేమించకూడదు!

పిండారబోసిన వెన్నెల్లో సెలయేరు వెండినురగల్ని వెదజల్లుకొంటూ, గలగలా పారుతోంది. రాజారావు మనసు హాయిగా నవ్వింది.